

శుక్రవారం చలో మేడిగడ్డ యాత్రలో భాగంగా అన్నారం బరాజ్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, పోచారం శ్రీనివాసరెడ్డి, కడియం శ్రీహరి, మల్లారెడ్డి, కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎంపీలు నామా నాగేశ్వర్‌రావు, మన్నె శ్రీనివాస్‌రెడ్డి, నేతలు ఎర్రబెల్లి దయాకర్‌రావు, గంగ్ర వెంకటరమణారెడ్డి, పుట్ట మధుకర్ తదితరులు

అభిమన్యుడు హరీశ్

సాగునీటిపైనా, కాళేశ్వరంపైనా కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను అసెంబ్లీలో హరీశ్‌రావు అభిమన్యుడిలా ఎదుర్కొన్నారు. సభలో సీఎం, మంత్రుల తప్పుడు మాటలను బీటుగా తిప్పికొట్టారు. అన్నీ తానై వారిని ఎదుర్కొన్నారు.

-కేటీఆర్

కాంగ్రెస్ హయాంలో కట్టిన కడెంప్రాజెక్టు రెండుసార్లు, గుండ్లవాగు రెండుసార్లు కొట్టుకుపోయింది. సాగర్‌లో, శ్రీశైలంలో లీకేజీలు వచ్చాయి. అయినా మేమెప్పుడూ రాజకీయం చేయలేదు, రాజకీయాలు మాట్లాడలేదు. -కేటీఆర్

లోకం పోకడ



కాంగ్రెస్ కుట్రలు ఎండగడతాం

- మేడిగడ్డ మరమ్మతుల్లో జాప్యం ఉద్దేశపూర్వకమే
- తెలంగాణను మళ్లీ ఎడారి చేయాలని చూస్తున్నారా?
- మీ గోబెల్స్ ప్రచారాన్ని తిప్పికొట్టేందుకే యాత్ర
- పంటలెండుతుంటే రాజకీయాలెందుకు?
- కడెం ప్రాజెక్టు రెండుసార్లు కొట్టుకుపోయింది గుర్తులేదా?
- బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ నిలదీత

వరంగల్, మార్చి 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/జయశంకర్ భూపాలపల్లి, హైదరాబాద్(నమస్తే తెలంగాణ): ''మీ పగ ప్రతీకారాలు మామీదేగా.. మరి రైతులనెందుకు ఇబ్బందిపెడతారు. దయచేసి వారిని వదిలేయండి. రాష్ట్రంపై పగబట్టకండి.. మీ కోపాన్ని మాపై తీర్చుకోండి.. ఇబ్బందేమీ లేదు'' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్‌కు హితవు పలికారు. ఇప్పటికైనా రాజకీయం బంద్‌చేసి రైతులకు నీళ్లివ్వాలని కోరారు. కాళేశ్వరప్రాజెక్టు యాత్రలో భాగంగా బీఆర్ఎస్ బృందం శుక్రవారం మేడిగడ్డ, అన్నారం బరాజ్‌లను సందర్శించింది. అనంతరం అన్నారం వద్ద ఏర్పాటు చేసిన వేదికపైనా, యాత్ర ప్రారంభానికి ముందు తెలంగాణ భవన్‌లోనూ కేటీఆర్ మాట్లాడారు. మేడిగడ్డకు మరమ్మతులు

పగ మాపై అయితే రైతులపై కోపం ఎందుకు?

మేడిగడ్డ బరాజ్ వద్ద గేట్లు మూసి బీఆర్ఎస్ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

చేయకుండా వర్షాకాలం వరకు వదిలేసి వరదకు బరాజ్ కొట్టుకుపోవాలని కాంగ్రెస్ చూస్తున్నదని ఆరోపించారు. మేడిగడ్డలో కుంగిన పిల్లర్లను మాత్రమే చూపిస్తూ ప్రాజెక్టు మొత్తాన్నే బద్నాం చేస్తున్నదని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మొత్తం ప్రాజెక్టు కొట్టుకుపోయేలా చేసి తెలంగాణను మళ్లీ ఎడారి చేయాలని చూస్తున్నదని ఆరోపించారు. పునరుద్ధరణ పనులు చేపట్టకపోవడం అందులో భాగమేనని పేర్కొన్నారు.

పంటలు ఎండుతున్నాయ్.. నిర్లక్ష్యం వద్దు

కాంగ్రెస్‌కు రైతు ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యంగా మారాయని కేటీఆర్ ధ్వజమెత్తారు. ప్రాజెక్టుపై విషయంలో ఎలాంటి విచారణనైనా చేసుకోవచ్చని, అవినీతి జరిగిందని తేలితే బాధ్యులపై కేసులు పెట్టి చర్యలు తీసుకోవాలని కేటీఆర్ సూచించారు. అంతే తప్ప ప్రాజెక్టును మాత్రం నిర్లక్ష్యం చేయొద్దని కోరారు. ఇప్పటికే పంటలు ఎండుతున్నాయని, ఇకనైనా మొండిపట్టుదల వీడి బరాజ్ పునరుద్ధరణ పనులు చేయపట్టాలని డిమాండ్ చేశారు. ముమ్మందు కాళేశ్వరంలో భాగమైన అన్ని ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, పంప్‌హౌజ్‌లను, ఎండుతున్న పంటలను సందర్శిస్తామని తెలిపారు.

గోబెల్స్ ప్రచారాన్ని తిప్పికొట్టేందుకే

కామధేనువు లాంటి కాళేశ్వరం ప్రాజెక్టుపై గోబెల్స్ ప్రచారాన్ని తిప్పికొట్టి, వాస్తవాలను ప్రజల ముందు పెట్టేందుకే ప్రాజెక్టును సందర్శించినట్టు కేటీఆర్ తెలిపారు. మేడిగడ్డకు వెళ్తామని నల్లగొండ అధినేత కేసీఆర్ చేసిన ప్రకటన ప్రకారం మేడిగడ్డను సందర్శించామని, ఇది మొదటి అడుగు మాత్రమేనని పేర్కొన్నారు. ప్రపంచంలోనే కాళేశ్వరం అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అని పేర్కొన్న కేటీఆర్.. మేడిగడ్డ బరాజ్‌లోని 85 పిల్లర్లలో 3 పిల్లర్లుకు సమస్య వస్తే మొత్తం కాళేశ్వరమే వృథా అయిందని, లక్షకోట్లు బూడిదలో పోశారంటూ ప్రభుత్వం దుర్మార్గంగా ప్రచారం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరమ్మతులను ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేస్తున్నదని ఆరోపించారు. తమతో పాటు ఇంజినీర్లు వెంకటేశం, దామోదర్‌రెడ్డి అందరూ వచ్చారని, బ్యారేజీలను చూశారని చెప్పారు.

జైతెలంగాణ అంటే థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తారా?

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

పరకాల/ఆత్మకూరు, మార్చి 1: రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని, 'జై తెలంగాణ' అంటే థర్డ్ డిగ్రీ ప్రయోగించడమేంటని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ నేతలతో కలిసి శుక్రవారం మేడిగడ్డ పర్యటనకు బయల్దేరిన కేటీఆర్ మార్గ మధ్యలో దామెర మండలంలోని ఎన్ఎస్ఆర్ హోటల్‌లో బాధిత నాయకులను పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 'జై తెలంగాణ' పదాన్ని నిషేధించారా? అని ప్రశ్నించారు. జై తెలంగాణ నినాదాలు చేసినందుకు అక్రమ కేసులు బనాయించి, దేశద్రోహుల్లా రాత్రికిరాత్రే అరెస్ట్ చేసి థర్డ్ డిగ్రీ ప్రయోగించడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, పోలీసులు చట్టబద్ధంగా వ్యవహరించాలని కోరారు.

మిగతా పోలీసులపై చర్యలు తీసుకోవాలి

అగ్రంపహాడ్ జాతరలో బీఆర్ఎస్ నేతలపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడంపై వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝాతో కేటీఆర్ ఫోన్‌లో మాట్లాడారు. ఆత్మకూరు ఎస్సైపై వేటువేసినంత మాత్రాన సరిపోదని, మిగతా పోలీసు అధికారులపైనా పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కొందరు పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఘటనతో ప్రమేయం ఉన్న ప్రతీ పోలీసు అధికారిపైనా పూర్తిస్థాయి విచారణ చేపట్టి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, లేదంటే న్యాయస్థానాలు, మానవహక్కుల సంఘాలను ఆశ్రయిస్తామని తెలిపారు. 14 ఏండ్లపాటు తెలంగాణ పోరాటంలో పాల్గొన్న తమకు నిర్బంధాలు కొత్త కాదని, ప్రతి గులాబీ సైనికుడిని కంటికి రెప్పలా కాపాడుకుంటామని కేటీఆర్ పేర్కొన్నారు. అగ్రంపహాడ్ ఘటన పునరావృతం అయితే పార్టీ చూస్తూ ఊరుకోదని కేటీఆర్ హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే నీటికి, కరెంటుకూ కటకట!

మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే కరెంట్‌కు, నీటికి కటకట ఏర్పడిందని వ్యవసాయశాఖ మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. మేడిగడ్డ పర్యటనలో ఉన్న ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. మూడెకరాల రైతులకు రైతుబంధు సాయం వేయడానికి మూడు నెలల సమయం తీసుకున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాకే దుర్భర పరిస్థితులు ఎదురయ్యాయనే విషయాన్ని అన్ని వర్గాల ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు అవగాహనారాహిత్యంతో వేల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. రాజకీయం, వ్యవసాయం ఒకే గాటన కట్టొద్దని హితవు పలికారు. ప్రాజెక్టు నిర్మాణంలో తప్పులు జరిగి ఉంటే ఉన్నత స్థాయి విచారణ జరిపి శిక్షపడేలా చర్యలు తీసుకోచ్చని చెప్పారు. అంతేకానీ కాళేశ్వరం ప్రాజెక్టు అంటే కేవలం మేడిగడ్డ బరాజ్, అందులో కుంగిన మూడు పిల్లర్లు మాత్రమే కాదని తెలిపారు. పిల్లర్ల సాకు చూపి రైతాంగం ఉసురు పోసుకోవద్దని సూచించారు. కాళేశ్వరంతో బీఆర్ఎస్ మహోన్నతను చెరిపేసేందుకు కాంగ్రెస్ దుర్బుద్ధితోనే దుష్ప్రచారం చేస్తున్నదని తెలిపారు. కాంగ్రెస్ సర్కారు దుష్ట వైఖరిని గడపగడపకూ తిరిగి ప్రజలకు వివరిస్తామని చెప్పారు. పంటలు ఎండిపోయిన రైతుల దుఃఖం చూస్తే బాధేస్తున్నదని, సాగునీచ్చి పంటపొలాలను కాపాడాలని నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

ప్రాజెక్టు వద్ద మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

'చలో మేడిగడ్డ' విజయవంతం



తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి; చిత్రంలో కేటీఆర్

కరువును పోగొట్టిన గొప్ప ప్రాజెక్ట్ కాళేశ్వరం

- మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 1 (నమస్తే తెలంగాణ): ఎడారిగా మారుతున్న తెలంగాణను సస్యశ్యామలం చేసిన గొప్ప ప్రాజెక్టు కాళేశ్వరమని మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి కొనియాడారు. దాన్ని జీర్ణించుకోలేని కొందరు రాజకీయాల కోసం అసత్యాలను, అభూత కల్పనలను ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టుల నిర్మాణంలో సాంకేతిక లోపాలు సహజమన్నారు. అందుకు కడెం ప్రాజెక్టే ఉదాహరణ అని గుర్తు చేశారు. కాంగ్రెస్ సర్కారు మేడిగడ్డ లోపాలను సరిదిద్దకుండా ప్రాజెక్టే వృథా అని ప్రచారం చేస్తున్నదని మండిపడ్డారు. కాళేశ్వరం నీళ్లు లేకుండానే టన్నుల కొద్దీ పంటలు పండాయా? అని ప్రశ్నించారు. రాజకీయాల కోసం రైతుల జీవితాలను పణంగా పెట్టవద్దని హితవు పలికారు. ప్రాజెక్టుకు రూపకల్పన చేసిన తమ సలహాలు తీసుకోవాలని కోరారు.

- రైతు ప్రయోజనాలే లక్ష్యంగా బీఆర్ఎస్ యాత్ర
- పెద్ద ఎత్తున కదిలివచ్చిన శ్రేణులు, రైతుల అపూర్వ స్వాగతం
- హైదరాబాద్ నుంచి దారిపొడవునా జన నీరాజనం
- రాష్ట్రవ్యాప్తంగా అన్నివర్గాల్లో అనూహ్య స్పందన

మేడిగడ్డ నుంచి నమస్తే తెలంగాణ ప్రత్యేక ప్రతినిధి: కాళేశ్వరం ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకు.. వాస్తవాలను ప్రజలకు వివరించేందుకు బీఆర్ఎస్ చేపట్టిన 'చలో మేడిగడ్డ' కార్యక్రమానికి అపూర్వ స్పందన వచ్చింది. వందలాది మంది నేతలు, వేలాది మంది ప్రజలు, కార్యకర్తలు వెంటరాగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ శాసనసభాపతులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదనాచారి, మాజీ మంత్రులు కడియం శ్రీహరి, కొప్పుల ఈశ్వర్, సత్యవతి రాథోడ్, సబిత ఇంద్రారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, మల్లారెడ్డి, నిరంజన్‌రెడ్డి, గంగుల కమలాకర్‌తోపాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పెద్ద ఎత్తున కదిలారు. మేడిగడ్డ ప్రాజెక్టును పునరుద్ధరించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం, రైతుల ప్రయోజనాలను కాపాడాలన్న డిమాండ్‌తో చేపట్టిన ఈ యాత్ర విజయవంతమైంది. ఈ యాత్ర పార్లమెంటు ఎన్నికల కోసం కాదని, దీనిని రాజకీయ కోణంలో చూడొద్దని, త్వరగా ప్రాజెక్టుకు మరమ్మతులు చేసి రైతులకు నీళ్లందేలా మూడాలన్నదే తమ లక్ష్యమని ఆ పార్టీ ప్రకటించింది. ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం తమ ప్రధాన లక్ష్యమని చెప్పింది. ఒకవైపు యాత్రకు బీఆర్ఎస్ పార్టీ పూనుకోవడంతో మరోవైపు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హడావుడిగా మీడియా సమావేశాలు పెట్టి నష్టనివారణ చర్యలకు ప్రయత్నించడమే దీనికి నిదర్శనం.

ఊరూరా ఘనస్వాగతం

మేడిగడ్డ, అన్నారం ప్రాజెక్టుల పర్యటనకు బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన పిలుపునకు ఊరూరా విశేష స్పందన వచ్చింది. శుక్రవారం ఉదయం ఎనిమిది గంటలకల్లా పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, నేతలు హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. సరిగ్గా 8.30 గంటలకు అక్కడి నుంచి మేడిగడ్డకు వాహనశ్రేణి ప్రారంభమైంది. సుమారు 1,000 మంది పార్టీ నేతలు ఈ యాత్రలో పాల్గొన్నారు. మార్గమధ్యంలో ఉప్పల్, భువనగిరి, జనగామ, వరంగల్, పరకాల, భూపాలపల్లి జిల్లాలకు చెందిన నేతలంతా హైదరాబాద్ నుంచి వస్తున్న వాహన శ్రేణులకు జత కలిశారు. పరకాల, స్టేషన్‌ఘన్‌పూర్, మంథని, పెద్దపల్లి, కరీంనగర్ తదితర ప్రాంతాల నుంచి నేతలు నేరుగా మేడిగడ్డకే చేరుకున్నారు. మార్గ మధ్యంలో స్వాగతం పలుకుతూ పెద్ద ఎత్తున తోరణాలు ఏర్పాటుచేశారు. పలుచోట్ల పటాకలు కాలుస్తూ, డప్పు వాయిద్యాలతో స్వాగతం పలికారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్ శ్రేణులు పెద్దఎత్తున స్వాగతం పలికారు. జనగామ జిల్లా పెంబర్తి వద్ద, లింగాలఘనపురం మండలం నెల్లుట్ల బైపాస్ రోడ్డులో, శాయంపేట మండలం మాందారిపేట స్టేజీ వద్ద, పరకాల అంబేద్కర్ సెంటర్, గణపురం మండలం గాంధీనగర్ జంక్షన్‌లో, రేగొండలో, కాటారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ యాత్ర బృందానికి స్వాగతం పలికారు.

'జల ప్రదాత'కు జేజేలు

జల ప్రదాతకు స్వాగతం, అపర భగీరథుడికి స్వాగతం.. అంటూ ఊరూరా పోస్టర్లు వెలిశాయి. గ్రామాల్లోని ప్రజలు చేతులెత్తి యాత్ర బృందం వాహన శ్రేణికి ఎదురొచ్చి అభివాదం చేశారు. మేడిగడ్డ బరాజ్ వద్దకు చేరుకున్న పార్టీ బృందానికి పెద్ద ఎత్తున ప్రజలు, పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. బరాజ్ మొత్తం జనంతోనే నిండిపోయింది. ఒక దశలో పోలీసులు అక్కడికి వచ్చిన వారిని అదుపు చేయలేకపోయారు. బరాజ్ గేట్లను మూసివేశారు. దీనిపై పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేయడంతో చివరకు బరాజ్ మీదకు అందరినీ అనుమతించక తప్పని పరిస్థితి ఏర్పడింది.

అడుగడుగునా పరిశీలించిన బృందం

మేడిగడ్డ బరాజ్‌లో కుంగిన పిల్లర్లను బీఆర్ఎస్ బృందం పరిశీలించింది. బరాజ్ పైనుంచి, కింది వరకు వెళ్లి గేట్లను కూడా పరిశీలించారు. దెబ్బతిన్న 19, 20, 21 పిల్లర్ల వద్దకు స్వయంగా వెళ్లి చూశారు. బృందానికి రిటైర్డ్ ఇంజినీర్లు దామోదర్‌రెడ్డి, వెంకటేశం, నీటిపారుదల రంగ నిపుణులు వీ ప్రకాశ్ తదితరులు అక్కడ జరిగిన పరిస్థితిని వివరించారు. దెబ్బతిన్న పిల్లర్లను ఎలా బాగు చేయవచ్చో వివరిస్తూ, ప్రత్యామ్నాయ మార్గాలనూ సూచించారు. ఎమ్మెల్యేల బృందంలో ఉన్న మాజీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు కూడా ప్రభుత్వం పూనుకుంటే ఎలా బాగు చేయవచ్చో చెప్పారు. మేడిగడ్డను పరిశీలించిన తర్వాత బీఆర్ఎస్ బృందం నేరుగా అన్నారం బరాజ్‌కు చేరుకున్నది. అక్కడ కూడా లోపాలు ఉన్నాయని ప్రభుత్వం చెప్తున్న ప్రాంతాలనూ పరిశీలించింది.

కడియం 'ప్రజెంటేషన్'కు విశేష స్పందన

అన్నారం బరాజ్ గడ్డపై నీటిపారుదల శాఖ మాజీ మంత్రి కడియం శ్రీహరి 'కాళేశ్వరంపై కాంగ్రెస్ విషప్రచారం.. బీఆర్ఎస్ వాస్తవాలు' పేరుతో రూపొందించిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను ఇచ్చారు. ప్రజలకు వాస్తవాలను వివరిస్తుండగా ప్రజలు, పార్టీ కార్యకర్తలు ఆసక్తిని కనబర్చారు. రాష్ట్ర ప్రభుత్వ తీరును ఎండగడుతున్నపుడు ప్రజలు, పార్టీ కార్యకర్తల నుంచి మంచి స్పందన వచ్చింది. రాజకీయంగా తమపై దాడి చేయండి.. ప్రజల ప్రయోజనాలను దెబ్బతీస్తామంటే ఊరుకోబోమని కడియం చేసిన వ్యాఖ్యలపై పార్టీ కార్యకర్తలు లేచి నిలబడి అండగా ఉంటామని.. ప్రభుత్వం తీరు సిగ్గు సిగ్గు అంటూ నినాదాలు చేశారు. బాధ్యతాయుతమైన ప్రభుత్వం ప్రజలకు నష్టం చేస్తే చూస్తూ ఊరుకోబోమని.. పోరాటాలు బీఆర్ఎస్‌కు కొత్త కాదని కడియం అంటే.. మేమంతా మీ వెంటే ఉంటామంటూ చప్పట్లతో ఆయన వ్యాఖ్యలకు మద్దతు ఇచ్చారు.

కేటీఆర్ లెక్కల వివరాలకు చప్పట్ల హోరు

కాళేశ్వరం ప్రాజెక్టు అత్యుత్తమంగా ఉన్నదని లెక్కలతో సహా మాజీ మంత్రి కేటీఆర్ వివరిస్తున్నంత సేపు కార్యకర్తలు చప్పట్లతో అభినందించారు. హరీశ్‌రావు ఒంటిచేత్తో అసెంబ్లీలో కాంగ్రెస్ సర్కారును నిలదీశారని, ఆ పార్టీ విధానాలను ఎండగట్టారని చెప్పినపుడు నినాదాలు మిన్నంటాయి. కాంగ్రెస్ పార్టీ చెప్తున్న అబద్ధాలను ప్రజలకు హరీశ్‌రావు ఏనాడో చెప్పారని వివరించారు. తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత విషయంలో మంత్రి ఉత్తమ్ చేసిన ఆరోపణలను సాక్షాలతో సహా హరీశ్‌రావు సభలో వివరించారని తెలిపారు. సెంట్రల్ వాటర్ కమిషన్ రాసిన లేఖను సభలో చూపించారని చెప్పారు.

అలసట లేకుండా అర్ధరాత్రి వరకు సాగిన యాత్ర

ఉదయం 8.30 గంటలకు మొదలైన బీఆర్ఎస్ బృందం యాత్ర అలసట లేకుండా కొనసాగింది. మేడిగడ్డ, అన్నారం బరాజ్ సందర్శన అర్ధరాత్రి వరకు సాగింది. పార్టీ కార్యకర్తలు, నాయకులు ఉత్సాహంగా ఈ యాత్రలో ఆసాంతం పాల్గొన్నారు. ఇంజినీర్ల సంఘం జేఏసీ నేత వెంకటేశం సభాముఖంగా కాళేశ్వరం ప్రాజెక్టుపై సాంకేతిక అంశాలను వివరించారు. ముమ్మాటికీ ఇక్కడ నీళ్లు ఉంటాయన్న అంచనాలతోనే ప్రాజెక్టు కట్టారని, మేడిగడ్డకు మరమ్మతులు చేసి వీలైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తేవాలని, మరమ్మతులు చేస్తే ఈ ప్రభుత్వానికే పేరు వస్తుందని చెప్పారు. ప్రాజెక్టులకు ఇలాంటి సమస్యలు తలెత్తడం ఇదే తొలిసారి కాదని, ఇలాంటి సమస్యలు వస్తాయని, వచ్చిన సమస్యలను భూతద్దంలో చూపించవద్దని హితవు పలికారు.

ఉత్తమ్ ఇదిగో లేఖ!

తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత ఉన్నా కూడా బీఆర్ఎస్ సర్కార్ కావాలనే రీడిజైన్ చేసిందని ఇటీవల మంత్రి ఉత్తమ్ చేసిన ఆరోపణల్లోని డొల్లతనాన్ని మేడిగడ్డ వేదికగా హరీశ్‌రావు బట్టబయలు చేశారు. తుమ్మిడిహట్టి వద్ద 160 టీఎంసీల జలాలు అందుబాటులో లేవని, ప్రత్యామ్నాయం చూసుకోవాలని సీడబ్ల్యూసీనే తెలంగాణకు లేఖ రాసిందని వెల్లడించారు. ఆ లేఖను మేడిగడ్డ వేదికగా చూపారు. ఇదిగో సాక్ష్యం అంటూ ఉత్తమ్ ఆరోపణలను హరీశ్ ఎండగట్టారు.

అంతంకాదిది ఆరంభం: కేటీఆర్

'చలో మేడిగడ్డ' పర్యటనతో బీఆర్ఎస్ పోరాటం ఆగబోదని కేటీఆర్ ప్రకటించారు. రైతుల ప్రయోజనాల కోసం ఎంతవరకైనా కొట్లాడతామని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్ని కాంపోనెంట్లను, రిజర్వాయర్లను, ప్రాజెక్టులను సందర్శిస్తామని తెలిపారు. ప్రజాసమస్యలు, కాంగ్రెస్ హామీల అమలు కోసం కూడా పర్యటనలు చేపడతామని వెల్లడించారు. 'చలో మేడిగడ్డ' కార్యక్రమానికి వెల్లువలా తరలివచ్చిన పార్టీ నాయకులకు, శ్రేణులకు, ప్రజలకు కేటీఆర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

జనగామ జిల్లా పెంబర్తి వద్ద కేటీఆర్‌కు స్వాగతం పలికేందుకు వచ్చిన నేతలు, కార్యకర్తలతో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

కాంగ్రెస్ విష ప్రచారం.. బీఆర్ఎస్ వాస్తవాలు

కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ విష ప్రచారాన్ని తిప్పికొట్టాలని బీఆర్ఎస్ నిర్ణయించుకున్నది. అందులో భాగంగా 'కాళేశ్వరంపై కాంగ్రెస్ విష ప్రచారం.. బీఆర్ఎస్ వాస్తవాలు' పేరిట బుక్‌లెట్ విడుదల చేసింది. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు రీడిజైనింగ్ ఆవశ్యకత, కాళేశ్వరం ప్రాజెక్టు సమగ్ర స్వరూపాన్ని అందులో వివరించింది. అంచనా వ్యయం పెరగడానికి కారణం, కాళేశ్వరం ద్వారా సాధించిన విజయాలను గణాంకాలతో వెల్లడించింది. ప్రాజెక్టులో భాగమైన రిజర్వాయర్లు, పంప్‌హౌజ్‌లు, కాలువల వివరాలను ఫొటోలతో ప్రచురించింది.

వరదలతోనే దెబ్బతిన్న మేడిగడ్డ పిల్లర్లు

- మరమ్మతులు చేయాలనే స్పృహ ఈ సర్కారుకు లేదు
- కేసీఆర్ ఉండి ఉంటే కాలయాపన జరిగేది కాదు
- సాగునీటిరంగ నిపుణుడు వీ ప్రకాశ్ ఆవేదన

కాళేశ్వరం, మార్చి 1: కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్‌లో ఎలాంటి లోపం లేదని, వరదల వల్లే మేడిగడ్డ పిల్లర్లు దెబ్బతిన్నాయని సాగునీటి రంగ నిపుణుడు వీ ప్రకాశ్ స్పష్టం చేశారు. అన్నారం బరాజ్ వద్ద శుక్రవారం ఆయన మాట్లాడారు. డిజైన్ లోపమైతే మూడు బరాజ్‌లలో రెండు పిల్లర్లే దెబ్బతింటాయా? అని ప్రశ్నించారు. గత 500 ఏండ్లలో ఇప్పుడు వచ్చినంత వరద ఎప్పుడూ రాలేదని, ఇక్కడ ఒక్కరోజులోనే 250 టీఎంసీల నీరు బరాజ్ పైనుంచి వెళ్లిందని, అయినా అది తట్టుకున్నదని తెలిపారు. మేడిగడ్డ బరాజ్ వద్ద మరమ్మతు చేయక వరదల్లో కొట్టుకుపోతే కోటి మంది ప్రజలకు అన్యాయం చేసినట్టేనని, వారు ఎప్పటికీ ఈ ప్రభుత్వాన్ని క్షమించరని హెచ్చరించారు. కేసీఆర్ ఉండి ఉంటే జనవరి నాటికే కన్నెపల్లి పంప్‌హౌస్ దగ్గరలో కాఫర్ డ్యామ్ కట్టి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోయించి, పంటలకు నీరందించేవారని వివరించారు. ఈ ప్రభుత్వానికి రిపేర్ చేసే ఉద్దేశమే లేదని, ఇప్పుడున్న సీఎం నీళ్ల కోసం, రాష్ట్రం కోసం కొట్లాడిన వ్యక్తి కాదు, జై తెలంగాణ అన్నోళ్లను రైఫిల్ ఎత్తికొట్టినవాడని, రాజకీయంగా కోటి మందితో ఆడుకుంటున్నాడని చెప్పారు. అబద్ధాలతో నమ్మించాలని చూస్తున్నాడని విమర్శించారు. అక్టోబర్ 21న బరాజ్ వద్ద ఎలా ఉందో ఇప్పుడూ అలానే ఉందని, ఏ ఒక్క నిపుణుడూ పిల్లర్ల వద్ద నేటికీ దిగి కారణాలను తెలుసుకోలేదని చెప్పారు. అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన శ్వేతపత్రాల్లో మూడో పేజీ, ఆరో పేజీ, పదో పేజీలో కష్టాల్లో మేడిగడ్డ బరాజ్ కట్టారు.. అని ఉన్నదని, మేడిగడ్డ బరాజ్ కట్టొద్దని శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, అనంతరామ్ దామోదర్ మరో ఐదుగురు ఇంజినీర్లు నివేదిక ఇచ్చినట్టు చూపారని తెలిపారు. అసెంబ్లీలో శ్వేతపత్రాలు తప్పుగా ఇచ్చి తప్పుదోవ పట్టించినవారికి సభా ఉల్లంఘన నోటీసులు ఇవ్వాలని పేర్కొన్నారు. 1956 నుంచి 2014 వరకు అసెంబ్లీలో ఇచ్చిన శ్వేతపత్రాల్లో అయకట్టు 52 లక్షల ఎకరాలు అని చెప్పారు కానీ 35 వేల మంది రైతులు బోర్లు వేసి ఆత్మహత్య చేసుకున్నారని వివరించారు.

హరీశ్‌రావు ప్రసంగంపై హర్షధ్వానాల వెల్లువ

మేడిగడ్డకు బీఆర్ఎస్ యాత్ర ప్రకటించిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వంలో కదలిక వచ్చిందని మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. నల్లగొండలో బీఆర్ఎస్ సభతోనే కృష్ణా నీటి విషయంలో రాష్ట్ర ప్రభుత్వ మెడలు వంచగలిగామని, అప్పటివరకు కేఆర్ఎంబీపై మడతపేచీ పెట్టిన కాంగ్రెస్ సర్కారు దిగివచ్చిందని స్పష్టం చేశారు. ఎన్డీఎస్ఏ రిపోర్టు వచ్చిన నెల రోజుల్లోపే మరమ్మతులు చేస్తామని ప్రకటించారని, ఇది మనం సాధించిన పాక్షిక విజయమని చెప్పారు. హరీశ్‌రావు ప